

నేడు నిజం గెలవాలి

మూడు నియోజకవర్గాల్లో నారా భువనేశ్వరి పర్యటన



అనంతపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా జిల్లా పర్యటనకు టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం వస్తున్నారు. మూడు నియోజకవర్గాల్లో ఆమె పర్యటిస్తారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మనోవేదనతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను ఆమె పరామర్శిస్తారు. వారికి ఆర్థికం సాయం చేస్తారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని 28వ డివిజన్‌లో టీడీపీ కార్యకర్త కుటుంబాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు ఆమె పరామర్శిస్తారు. ఆ తరువాత కళ్యాణదుర్గం నియోజకవర్గ పర్యటనకు వెళతారు. కళ్యాణదుర్గం రూరల్ మండలం ఎం.కొండాపురంలో మృతిచెందిన కార్యకర్త కుటుంబాన్ని 3.30 గంటలకు పరామర్శిస్తారు. సాయంత్రం 4.05 గంటలకు అదే నియోజకవర్గంలోని ముద్దినాయనపల్లి గ్రామంలో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు ఎం.కొత్తూరులో కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారు. రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండలం గోపులాపురంలో కార్యకర్త కుటుంబాన్ని రాత్రి 7.05 గంటలకు పరామర్శిస్తారు. ఆ తరువాత అనంతపురం నగరానికి చేరుకుంటారు. బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణమండపం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో రాత్రికి బస చేస్తారు.

అనంత అజెండా ప్రకటించండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్
వివిధ పార్టీల నాయకులకు సీపీఎం ప్రతిపాదనలు



మాజీ మంత్రి పరిటాల సునీతను కలిసి ప్రతిపాదనలు అందజేస్తున్న సీపీఎం నాయకులు

అనంతపురం కల్చరల్, మార్చి 5: రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధికోసం అన్ని పార్టీలు తమ అజెండాను ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిని మంగళవారం వారి నివాసాల్లో సీపీఎం నాయకులు కలిసి, తమ పార్టీ ప్రతిపాదనలను అందజేశారు. మూడురోజుల్లో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులందరికీ ఈ ప్రతిపాదనలను అందజేస్తామని రాంభూపాల్ తెలిపారు. వ్యక్తిగత విమర్శలు, రాజకీయ ఎత్తుగడల ద్వారా గెలవడం కాకుండా, జిల్లా అభివృద్ధికి ప్రతి ఒక్క అభ్యర్థి స్పష్టమైన విధాన ప్రకటన చేసి, దాని అమలుకోసం కృషిచేసి, ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్క శాతం భూమికి కూడా నికరమైన సాగునీటి వనరులు లేని జిల్లా అనంతపురం అని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వెయ్యిమందికి ప్రత్యక్షంగా ఉపాధి చూపించే ఒక్క పరిశ్రమ కూడా లేకపోవడం జిల్లా వెనుకబాటుకు నిదర్శనమని అన్నారు. రైల్వే కేంద్రంగా ఉన్న గుంతకల్లు గత 20 సంవత్సరాల్లో జనాభా తగ్గిపోవడం ఆందోళనకర పరిణామమని అన్నారు. రాయదుర్గంలో జీన్స్ పరిశ్రమ దాదాపు మూతపడే పరిస్థితి వచ్చిందని, తాడిపత్రిలో బండల పరిశ్రమ ఇదే స్థితిలో ఉందని అన్నారు. రైల్వే డివిజన్ అభివృద్ధి కాకపోగా, పేరుమార్పుతో డివిజన్ తరలిస్తారని గుంతకల్లు ప్రాంతాల్లో ఆందోళన నెలకొందని అన్నారు. కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న చిన్న పరిశ్రమలు సైతం మూతపడితే యువత భవితకు భరోసా ఉండదని అన్నారు. కాబట్టి స్థానిక ప్రజాప్రతినిధులు వారి పార్టీల అధినాయకత్వంతో జిల్లా అభివృద్ధికి అవసరమైన వ్యవసాయం, నీటిపారుదల, పరిశ్రమల ఏర్పాటు, విద్య, వైద్యం, సామాజిక తరగతుల అభివృద్ధి, మహిళా సంక్షేమంపై విధాన ప్రకటనలు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, నాగేంద్రకుమార్, బాలరంగయ్య, నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, ముస్కిన్, వెంకటనారాయణ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సేవలో వలంటీర్లు



రాయదుర్గం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గ్రామ వలంటీర్లు



వైసీపీ స్టిక్కర్ అంటిస్తున్న వలంటీరు బేబీ

డీ.హీరేహాళ్, మార్చి 5: రాయదుర్గం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తరఫున గ్రామ వలంటీర్లు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. డీ.హీరేహాళ్ మండలంలోని సోమలాపురం, నాగలాపురం, చెర్లోపల్లి గ్రామాల్లో మెట్టు గోవిందరెడ్డి కుమారుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి వైసీపీ నాయకులతో కలసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నాయకులతో కలసి గ్రామ వలంటీర్లు చైత్ర, బేబీ, అమరేష్ తదితరులు ఇంటింటికీ తిరుగుతూ వైసీపీ స్టిక్కర్లు అంటించి, ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొనకూడదని, విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రఘునాథ్ అన్నారు. గతంలోనే సర్క్యులర్ జారీ చేశామని ఆయన అన్నారు.

పింఛన్ నొక్కేసిన వలంటీరు



నాగభూషణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బాధితులు

కూడేరు, మార్చి 5: వృద్ధులు, దివ్యాంగులకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్మును గ్రామ వలంటీరు భీమలింగయ్య నొక్కేశాడు. దీంతో బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. కూడేరుకు చెందిన పింఛన్‌దారులు కాంతమ్మ, సురేఖ, నాగరత్నమ్మ, రుత్విక్, ఎర్రిస్వామి, శంకరమ్మ, ఈశ్వరయ్య, పార్వతమ్మ నుంచి వలంటీరు వేలిముద్రలు సేకరించాడు. కానీ పింఛన్ ఇవ్వలేదు. సొమ్ము అడిగితే ఆన్‌లైన్ కాలేదని అన్నాడని, రెండు రోజుల తర్వాత అడిగితే డబ్బులు పోయాయని అంటున్నాడని బాధితులు వాపోయారు. ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ నాగభూషణరెడ్డికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం తన దృష్టికి వచ్చిందని, విచారిస్తామని ఎంపీడీఓ కేఎం బాషా అన్నారు. కాగా, అధికారులకు బాధితులు ఫిర్యాదు చేసిన విషయం తెలియగానే వలంటీరు కుటుంబ సభ్యులు వారితో వాదనకు దిగారు.



● ఈ ఫొటోలో ఉన్నది గార్లదిన్నెలోని విద్యుత్ శాఖ కార్యాలయం. ఇక్కడ ఏఈఈ లేక ఏడాది కావస్తోంది. పక్కనే ఉన్న శింగనమల మండల ఏఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించారు. కానీ ఆయన సొంత మండలం విడిచి వచ్చే పరిస్థితి లేదు. గార్లదిన్నె కార్యాలయానికి ఎప్పుడొస్తారో.. ఎప్పుడు వెళతారో తెలీయని పరిస్థితి. దీంతో గార్లదిన్నె మండలం ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు కార్యాలయానికి వెళితే.. సిబ్బంది నుంచి సరైన సమాధానం రావడం లేదని వినియోగదారులు అంటున్నారు.

● ఈ ఫొటోలో ఉన్నది అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్డులో ఉన్న డి-5సెక్షన్ ఏఈఈ కార్యాలయం. ఏఈఈగా పనిచేస్తున్న నాగరాజు పని భారం కారణంగా ఐదు నెలల క్రితం బదిలీ చేయించుకుని వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆ స్థానంలో మరో అధికారిని నియమించ లేదు. డి-6 సెక్షన్ ఏఈఈకి అదనపు బాధ్యతలు అప్పగించి, ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారు. డి-1, డి-4 సెక్షన్‌లకు కూడా ఏఈఈలు లేకపోడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలోని చాలా కార్యాలయాల్లో ఇదే పరిస్థితి.



సగం ఖాళీ...!

విద్యుత్ శాఖలో ఏఈఈల కొరత
పక్క మండలాల వారికి బాధ్యతలు
పనిభారంతో ఏఈఈల సతమతం
వినియోగదారుల సేవలపై ప్రభావం
జిల్లాలో సగం సెక్షన్లకు ఇన్‌చార్జిలే గతి



అనంతపురం రూరల్

విద్యుత్ శాఖలో ఇన్‌చార్జిల పాలన సాగుతోంది. జిల్లాలోని సెక్షన్ కార్యాలయాల్లో ఏఈఈ కొరత వేధిస్తోంది. సగం కార్యాలయాలకు ఏఈఈలు లేరంటే అతియోశక్తి కాదు. కొరత కారణంగా పక్క కార్యాలయాల ఏఈఈలకు, లేదంటే అదే కార్యాలయంలో పనిచేసే జేఈఈలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫలితంగా నిర్వహణ సమస్యలు తలెత్తుతున్నాయి. అదనపు బాధ్యతలతో ఏఈఈలు, జేఈఈలు తలమునకలవుతున్నారు. సొంత కార్యాలయం పరిధిలో సేవలకే ఇబ్బంది పడుతున్నారు. అదనంగా ఉన్న కార్యాలయాలకు వెళ్లలేని పరిస్థితి. అదనపు బాధ్యతలు ఉన్న ప్రాంతాలకు అడపాదడప వెళ్లడం తప్ప స్థానికంగా ఉండి పనులు చక్కబెట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభావం వినియోగదారుల సేవలపై పడుతోంది. సమస్యల పరిష్కరం కోసం వినియోగదారులు కార్యాలయాలకు వెళ్లడం, అధికారులు లేకపోవడంతో నిరాశతో వెనుదిరగడం క్షేత్రస్థాయిలో జరుగుతోంది.

ఇన్‌చార్జిలే దిక్కు

ఉమ్మడి జిల్లాలో 82కిపైగా ఆపరేషన్ సెక్షన్ కార్యాలయాలు ఉన్నాయి. ఇందులో సగం కార్యాలయాలకు ఏఈఈలు లేరు. అనంతపురంలోని మూడు సెక్షన్లకు ఇన్‌చార్జులే దిక్కుగా మారారు. గార్లదిన్నె, కూడేరు, నార్పల, కూడేరు, కనగానపల్లి, యాడికి, పుట్లూరు, హిందూపురం డి-సెక్షన్, అగళి, ముదిగుబ్బ, బ్రహ్మసముద్రం, రాయదుర్గం, గుమ్మఘట్ట, ఉరవకొండ త దితర ప్రాంతాల్లో ఏఈఈలు లేరు. ఉన్నతాధికారులు పక్క మండలాల ఏఈఈలు, జేఈఈలకు అదనపు బాధ్యతలు అప్పగించి మిన్నకుండిపోయారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధికారుల పట్టించుకోవడం లేదు. జరగరానిది ఇన్‌చార్జిలపై నెట్టివేస్తున్నారు. దీంతో ఇన్‌చార్జిలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నవారు మానసిక ఒ త్తిడికి గురవుతున్నారు. మరికొందరు ప్రైవేటు వ్యక్తులను సొంత డబ్బులు చెల్లిస్తూ పనిచేయించుకుంటున్నారు.

సేవలపై ప్రభావం

ఏఈఈల కొరత ప్రభావం వినియోగదారుల సేవలపై పడుతోంది. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, లో ఓల్టేజీ, హై ఓల్టేజీ వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు బిల్లులు ఎక్కువ రావడం, గృహ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం తదితర సమస్యలతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. వీటి పరిష్కారం కోసం కార్యాలయాలకు వెళుతున్నారు. కానీ అక్కడ అధికారులు లేకపోవడంతో ఉన్న సిబ్బందికి సమస్యను చెప్పి వచ్చేస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. రైతుల కష్టాలు రెట్టింపు అయ్యాయి. పంటలను కాపాడుకోవడానికి తంటాలు పడుతున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయాల ఎదుట, రోడ్లపై ఆందోళనకు దిగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయం



సమస్య చెప్పుకునే వీలులేకుండా పోయింది..

మండలంలో ఏఈఈ లేక ఏడాది అవుతోంది. విద్యుత్ పరమైన సమస్యలు చెప్పుకోవడానికి వీలులేకుండా పోయింది. ఇన్‌చార్జి ఏఈఈ ఎప్పుడొస్తారో తెలియడం లేదు. వ్యవసాయానికి కరెంటు సక్రమంగా రావడంలేదు. ఎలా పడితే అలా వదులుతున్నారు. వేసవి తీవ్రత పెరుగుతోంది. నీరు సరిగా అందక వరిమడులు దెబ్బతింటున్నాయి. విద్యుత్ సమస్య కారనంగా పంటకు నీరుపెట్టేందుకు అవస్థలు పడుతున్నాం.

- చెన్నారెడ్డి, జంబులదిన్నె, గార్లదిన్నె మండలం

విద్యుత్ సరఫరాలో సమస్యలు..

జిల్లాలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి. రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లో ఓల్టేజీ, హై ఓల్టేజీ వంటి సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు. కరెంటు ఎప్పుడొస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఏఈఈలు స్థానికంగా ఉండటంలేదు. ఇన్‌చార్జిలు వారి ప్రాంతాల్లో సమస్యలు చూసుకోవడానికి సరిపోతున్నారు. మరో ప్రాంతానికి వెళ్లి పనులు చక్కబెట్టడం ఎలా సాధ్యమో ఉన్నతాధికారులకే తెలియాలి. ఏఈఈ భర్తీలను చేస్తే కొంతలో కొంతైనా ఉపయోగం ఉంటుంది. అధికారులు, పాలకులు చొరవ చూపాలి.

- రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏపీ రైతు సంఘం



ఏడుపే !

వ్యవసాయానికి ఏడు గంటలే విద్యుత్
పగలు ఐదు గంటలు, రాత్రి 2 గంటలు
పంటలు ఎండుతాయని రైతుల ఆందోళన

యల్లనూరు, మార్చి 5: వ్యవసాయానికి విడతలవారిగా 7 గంటలే విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. యల్లనూరు మండ లంలో పండ్ల తోటలతోపాటు మాగాణి భూముల్లో వరి పంటను సాగు చేశారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందిస్తే పంటలకు సమృద్ధిగా నీరు అంది పంటలు పండే అవకాశం ఉంది. ముఖ్యంగా ఈ ప్రాంతం నల్ల, ఎర్రరేగడి నేలలతో కూడి ఉండటంతో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈక్రమంలో రెండు గంటలు తక్కువగా విద్యుత్ సరఫరా చేస్తుండటంతో పంటలకు సక్రమంగా నీరందక ఎండిపోతున్నాయి. 7గంటల విద్యుత్‌ను కూడా రెండు దఫాలుగా సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పగలు 4గంటలు, మరికొన్ని చోట్ల 5గంటలు సరఫరా చేస్తున్నారు. మిగిలినది రాత్రి సమయంలో ఇస్తుండటంతో పొలాల వద్దకు వెళ్లలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వరికి నీరు ఎక్కువ అవసరం



నాలుగు ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నా. సాధారణంగా వరి పంటకు ఎక్కువ నీరు కావాలి. అయి వర్షాకాలంలో 9గంటల విద్యుత్ సరఫరా చేసిన అధికారులు, వేసవి 7గంటలకు కుదించడంతో ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు. పగటిపూట ఇస్తున్న విద్యుత్‌తో పంటలకు నీరు తిప్పలేకున్నాం. ఇక రాత్రి సమయంలో పొలాల వద్దకు వెళ్లాలంటే పురుగూ, పుట్ర ఉంటాయేమోనని భయపడాల్సి వస్తోంది.

- బాబయ్య, యల్లనూరు

అరటిపంట దెబ్బతింటోంది



కరెంట్ కోతతో తడిలేక అరటిపంట దెబ్బతింటోంది. తగినంత తేమశాతం లేకపోతే అరటి చెట్లు కిందకు పడిపోయే అవకాశాలు ఎక్కువ. పగలు, రాత్రి సమయంలో కరెంట్ వదులుతుండటంతో చెట్టుకు కావాల్సిన నీరు సమృద్ధిగా అందడం లేదు. దీంతో అరటికాయల నాణ్యత తగ్గిపోతోంది. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఏమిచేయాలో అర్థం కావడం లేదు.

- రాంమోహన్‌రెడ్డి, లక్షుంపల్లి



శేషవాహనంపై బుగ్గ రామలింగేశ్వరుడు

తాడిపత్రి టౌన్, మార్చి 5: పట్టణంలోని బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారు శేషవాహనంపై విహరించారు. ఈ సందర్భంగా స్వామి వారి ఉత్సవమూర్తికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ పట్టణ వీధుల్లో ఊరేగించారు. స్వామివారిని భక్తులు పెద్దఎత్తున దర్శించుకున్నారు.

పనిచేసినవారికి టిక్కెట్ ఇవ్వండి

టీడీపీ శ్రేణుల డిమాండ్.. గుమ్మనూరు చేరికపై నిరసన



టీడీపీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

గుంతకల్లు, మార్చి 5: ఎంతో క్లిష్టమైన పరిస్థితుల్లో, వ్యయప్రయాసల కోర్చి, పార్టీని అంటిపెట్టుకుని కార్యక్రమాలను నిర్వహించిన వారికే టిక్కెట్ ఇవ్వాలని టీడీపీ గుంతకల్లు నియోజకవర్గ శ్రేణులు డిమాండ్ చేశాయి. కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను పార్టీలో చేర్చుకోవద్దని పార్టీ అధినాయకత్వానికి విన్నవించాయి. 'వైసీపీలో చెత్త మన పార్టీలోకి తెస్తే బంగారం అవుతుందా..?' అని పలువురు ప్రశ్నించారు. గుంతకల్లు పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం సాయంత్రం నిరసనకు దిగారు. తాను టీడీపీలో చేరుతున్నాని, గుంతకల్లు ఎమ్మెల్యే టిక్కెట్టు తనకే ఖాయమైందని గుమ్మనూరు జయరాం చేసిన వ్యాఖ్యలు టీవీలు, సోషల్ మీడియాలో చూసిన పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదనకు లోనయ్యాయి. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ అనుచరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు గుంతకల్లుకు చేరుకున్నారు. తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ రెడ్డి, న్యాయవాది హేమాద్రి, నాయకులు శ్రీనివాస యాదవ్, లక్ష్మీదేవి తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. ఎంతో చెడ్డపేరు తెచ్చుకున్న సీఎం జగన్‌కే జయరాం పనితీరు చండాలంగా కనిపించి, టిక్కెట్ ఇవ్వలేదని, అటువంటి వ్యక్తికి టీడీపీ టిక్కెట్టు ఇవ్వడం సరికాదని అన్నారు. గడ్డు పరిస్థితుల్లో పార్టీకి అండగా నిలిచిన జితేంద్రగౌడుకు టిక్కెట్టును కేటాయించాలని డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లాలో జయరాం దౌర్జన్యాలు, అక్రమాలు పెచ్చిమీరాయని, అతడికి టిక్కెట్టు ఇస్తే ప్రశాంతంగా ఉన్న గుంతకల్లును కూడా భ్రష్టుపట్టిస్తాడని ఆందోళన వ్యక్తం చేశారు. దౌర్జన్యాలకు పాల్పడేవారికి గుంతకల్లు ప్రజలు ఓటువెయ్యరని అన్నారు.

మిమ్మల్ని గెలిపిస్తాం సార్..!

మమ్మల్ని రొంత చూసుకోండి..!
ఎమ్మెల్యే అనంతకు బీఎల్‌ఓల భరోసా

అనంతపురం క్రైం, మార్చి 5: అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఎన్నికల రాజకీయానికి తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా, బీఎల్‌ఓలుగా ఉన్న సచివాలయ ఉద్యోగులతో రాజకీయ సమావేశాన్ని నిర్వహించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాకే సచివాలయ వ్యవస్థ వచ్చింది, ఆ ఉద్యోగాలు తామే ఇచ్చామని, కాబట్టి తమకు ఓట్లు వేయాలని ఎమ్మెల్యే కోరారు. దీనికి బీఎల్‌ఓలుగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగులు కొందరు 'ఔను.. మీరే ఉద్యోగాలు ఇచ్చారు.. మిమ్మల్ని గెలిపిస్తాం.. మమ్మల్ని చూసుకోండి..' అన్నట్లుగా అత్యుత్సాహం ప్రదర్శించారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాలులో మంగళవారం సాయంత్రం సచివాలయ ఉద్యోగులతో ఎమ్మెల్యే అనంత సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన సచివాలయ ఉద్యోగులలో పలువురు బూత్ లెవల్ ఆఫీసర్లుగా ఉన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులు, సచివాలయ వ్యవస్థ తదితర విషయాల గురించి మాట్లాడిన ఎమ్మెల్యే, తనకు ఎన్నికల్లో సహకరించాలని కోరారు. వెల్ఫేర్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ, బీఎల్‌ఓలుగా ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేకు మద్దతుగా ఆ సమావేశంలో మాట్లాడారు. 'ఈ ప్రభుత్వం రాగానే మాకు ఉద్యోగాలొచ్చాయి. చాలా సంతోషం. మిమ్మల్ని తప్పకుండా గెలిపించుకుంటాం సర్. ఆ బాధ్యత మాదే..' అని వారు గొప్పలు పోయినట్లు తెలిసింది. బదులుగా తమకు ఉద్యోగోన్నతులు కల్పించాలని, పే స్కేల్ పెంపునకు సహకరించాలని కోరారట. ఈ వ్యవహారంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల విధుల్లో ఉన్న బీఎల్‌ఓలు ఓ రాజకీయ పార్టీ కార్యక్రమంలో ఎలా పాల్గొంటారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై విచారించి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు వైద్యకళాశాల స్నాతకోత్సవం

అనంతపురం టౌన్, మార్చి 5: అనంతపురం వైద్యకళాశాల 19వ స్నాతకోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు తెలిపారు. 2018-19 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్‌లో చేరి, కోర్సు పూర్తి చేసుకున్న వంద మందికి డాక్టర్ పట్టాలు అందించి అభినందిస్తామని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో బుధవారం సాయంత్రం వేడుకలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమానికి కలెక్టర్ గౌతమి, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ రఘునందన్ తదితరులు హాజరవుతారని ప్రిన్సిపాల్ తెలిపారు

నిరుద్యోగులకు డ్రైవింగ్‌లో శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5: నిరుద్యోగ యువతకు డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించేందుకు ఈనెల 11 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 45 రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 19-35 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న... 8వ తరగతి పూర్తయిన యువకులు అర్హులన్నారు. కంప్యూటర్ డ్రైవింగ్ సిములేటర్ ద్వారా బేసిక్ డ్రైవింగ్ నైపుణ్య శిక్షణ, ఆర్టీఓ అధికారుల సహకారంతో డ్రైవింగ్ పరీక్షలు, లైసెన్సు ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 83097 57739, 99594 22884ను సంప్రదించాలని కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి పరీక్షలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 10న ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల ఉమ్మడి అనంత జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకూ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాలు ముందుగా చేరుకోవాలన్నారు. హాల్ టికెట్‌లో విద్యార్థుల ఫొటో తప్పుగా ఉంటే... ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డుతో పరీక్షా కేంద్రానికి హాజరుకావాలన్నారు.

ఖరీఫ్ పంట నష్టపరిహారం నేడు విడుదల

అనంతపురం అర్బన్, మార్చి 5: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు ఆఫీస్ నుంచి ఖరీఫ్-2023 పంటనష్టపరిహారాన్ని బుధవారం విడుదల చేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 1,79,815 హెక్టార్లల్లో సాగు చేసిన 1,69,970 మంది రైతులు రూ.251.2 కోట్ల విలువైన పంటను నష్టపోయారని, ఆ మొత్తాన్ని వారి ఖాతాల్లో జమ చేస్తారని తెలిపారు.

డీసీహెచ్‌ఎస్ పోస్టులకు నేడు కౌన్సెలింగ్

అనంతపురం టౌన్, మార్చి 5: వైద్యవిధానశాఖలో వైద్యపోస్టులకు ఎంపికైన అభ్యర్థుల రెండో జాబితా విడుదల చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. మొత్తం 26 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి ఆ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. వారికి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయిస్తామన్నారు. తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో హాజరుకావాలన్నారు.

ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 5: ఏపీఎంఐపీ పీడీగా రఘునాథ్‌రెడ్డిని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యానశాఖ ఏడీ రఘునాథ్‌రెడ్డి ఇదివరకు జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారిగా విధులు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో ఉద్యోగోన్నతిపై ఏపీఎంఐపీ పీడీగా ఆయన్ను నియమించారు. ఇదివరకు ఏపీఎంఐపీ ఇన్‌చార్జి పీడీగా పనిచేసిన ఫిరోజ్ ఖాన్ ఇక్కడే ఏపీడీగా కొనసాగనున్నారు. ఇక్కడ ఏపీడీ ఫజలున్నీసా బేగంను చిత్తూరు ఏపీఎంఐపీ ఏపీడీగా బదిలీ చేశారు.

నిరుద్యోగులకు కంప్యూటర్ శిక్షణ, ఉపాధి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5: నిరుద్యోగ యువతీ, యువకులకు కంప్యూటర్ టెక్నాలజీపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లారెడ్డి తెలిపారు. 60 రోజుల పాటు బేసిక్ కంప్యూటర్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, బేసిక్ ట్యాలీ, లైఫ్ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్, బేసిక్ స్పోకెన్ ఇంగ్లీష్, కస్టమర్ రిలేషన్‌షిప్ స్కిల్స్ కోర్సులలో నిరుద్యోగ యువతీ, యువకులకు శిక్షణ కల్పిస్తామన్నారు. 20-35 సంవత్సరాలు వయస్సు కలిగి ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, ఉపాధి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 73969 50345, 77807 52418ను సంప్రదించాలన్నారు.

టీటీసీ ఫలితాలు విడుదల

అనంతపురం విద్య, మార్చి 5: టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (టీటీసీ) కోర్సు పరీక్షలు 2023 ఫలితాలు విడుదలయ్యాయని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలను గత ఏడాది డిసెంబరు 17న నిర్వహించామని, అభ్యర్థులు తమ ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చని అన్నారు. అభ్యర్థుల ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అనంతపురం డీఈఓ ఆఫీస్‌కు కాగానే సమాచారం ఇస్తామన్నారు.

8న జిల్లా మ్యూజియం ప్రారంభోత్సవం

అనంతపురం కల్చరల్, మార్చి 5: స్థానిక ఆదిమూర్తి నగర్‌లో కొత్తగా నిర్మించిన పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు మ్యూజియంను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం ప్రారంభిస్తారని ఆ శాఖ ఏడీ రజిత ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు నుంచే మ్యూజియంలో సందర్శనకు పురావస్తు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు.

ఫీల్డు అసిస్టెంట్ మృతి

నల్లమాడ, మార్చి 5: మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన ఫీల్డు అసిస్టెంట్ నీలకంఠ(25) మంగళవారం మృతిచెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు నీలకంఠ ఉపాధి పనులవద్దకెళ్లి, పనులు ముగించుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. నీరు తాగి అస్వస్థతతో ఇంట్లో సొమ్మసిల్లి పడిపోయారు. గ్రామస్థులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్యతోపాటు మూడునెలల చిన్నారి ఉన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.18 వేలు

అనంతపురంరూరల్, మార్చి 5: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.18 వేలు, కనిష్ఠంగా రూ.9 వేలు, సరాసరి రూ.14 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 171 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ప్రమాణం చేస్తేనే.. పని చేస్తా..!

- వైసీపీ సేవలో కదిరి అధికార యంత్రాంగం
- మత గ్రంథంతో ఓ అధికారి ప్రచారం
- అధికార పార్టీకి ఓటేస్తానని దేవుడిపై ప్రమాణం చేయాలని ఒత్తిళ్లు
- చేస్తేనే పని చేసిపెడుతున్న వైనం
- వచ్చీరాగానే వైసీపీ ఇన్‌చార్జిని కలిసిన మున్సిపల్ కమిషనర్, సీఐ
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

ఆయన కదిరి మున్సిపాలిటీలోని ఓ కీలక విభాగానికి అధికారి. ఏడాది క్రితం ఇక్కడికి బదిలీపై వచ్చాడు. ఇటీవల వరకు మామూలుగానే ఉన్నాడు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో తన నిజస్వరూపాన్ని బయటపెట్టాడు. ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు కోసం తన అధికారాలను పావుగా వాడుకుంటున్నాడు. పనుల మీద కార్యాలయంలో ఆయన వద్దకొచ్చినా.. ఆయనే ఫీల్డ్‌కు వెళ్లినా వైసీపీ ప్రచారం చేస్తున్నాడు. మత గ్రంథాన్ని దగ్గర పెట్టుకుని, తాను నమ్మిన దేవుని సాక్షిగా జగన్‌కే ఓటేస్తామని చెప్పాలని బలవంత పెడుతున్నట్లు సమాచారం. వారు ప్రమాణం చేసిన తరువాతే వారికి పని చేసిపెడుతున్నట్లు సర్వత్రా చర్చించుకుంటున్నారు. ఈ అధికారి ఎన్నికల్లో ఎంతగా అధికార పార్టీ కోసం పనిచేస్తారోనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణం బదిలీ చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

కదిరి, మార్చి 5

ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో కదిరిలో అధికారులు.. అధికార పార్టీ సేవలో తరిస్తున్నారు. అధికార పార్టీ కోసమే వచ్చినట్లు వ్యవహరిస్తున్నారు. సాధారణంగా బదిలీపై వచ్చిన అధికారులు ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేనో, మున్సిపల్ చైర్మన్‌నో కలుస్తారు. ప్రస్తుతం కదిరికి వచ్చిన అధికారులు మాత్రం సరాసరి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మగ్బూల్‌ను కలిశారు. బొకేలు ఇచ్చి, స్వామిభక్తి చాటుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆయననే ముఖ్య అతిథిగా పిలుస్తున్నారు. ఆయన ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నారు కూడా. ప్రొటోకాల్‌కు తిలోదకాలిచ్చారు. ఇప్పటికే ఇక్కడ పనిచేస్తున్న అధికారులు కూడా ఎన్నికలు దగ్గర పడేకొద్దీ నిజస్వరూపాన్ని బయట పెడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన అధికారులు తిరిగి ఇక్కడికే వచ్చేలా ప్రణాళిక రచించినట్లు తెలిసింది.

వైసీపీ కోసమే వచ్చారా?

రానున్న ఎన్నికల్లో వైసీపీ కోసం పనిచేయడానికి వచ్చారా అన్నవిధంగా కొత్తగా వచ్చిన కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నట్లుతెలుస్తోంది. మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ ఇటీవల బదిలీపై కదిరికి వచ్చారు. వచ్చీరాగానే వైసీపీ ఇన్‌చార్జి మగ్బూల్‌ను కలిసారు.



కదిరి వైసీపీ సమన్వయకర్త మక్బూల్‌ను కలిసిన కమిషనర్

ఆయన తీరుతో పట్టణ ప్రజలు విస్తు పోయారు. మున్సిపల్ కమిషనర్ ఒక పార్టీ ఇన్‌చార్జిని కలిస్తే మిగతా ఉద్యోగులకు ఏం సందేశం ఇచ్చినట్లు అని చర్చించుకున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కూడా ఆయనకు పెద్ద పీట వేసి, కమిషనర్ సైతం నిలబడుకోవడం గమనార్హం. పట్టణ సీఐ పుల్లయ్య కదిరికి బదిలీపై వస్తూనే వైసీపీ ఇన్‌చార్జిని కలిశారు. ఇది చర్చనీయాంశమైంది. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు, ఇలా ఓ పార్టీ ఇన్‌చార్జిని కలవడం ఏమిటని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇలా నియోజకవర్గంలో పలువురు ప్రధానాధికారులు.. వైసీపీకి వత్తాసు పలుకుతుంటే తామెలా పనిచేయగలమని పలువురు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ తంతు పబ్లిక్‌గానే సాగుతున్నా.. జిల్లా ఉన్నతాధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు.

ఆ అధికారులు.. ఆ పక్షమేనా?

ఇటీవల కొంతమంది అధికారులు కదిరి నియోజకవర్గానికి బదిలీపై వచ్చారు. మరికొంతమంది ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఇక్కడే ఉండి స్వామిభక్తి చాటుకుంటున్నట్లు సమాచారం. ఇక్కడ రెవెన్యూ కార్యాలయంలో పనిచేసి, డిమోషన్‌పై ఇతర ప్రాంతాలకు వెళ్లి, మళ్లీ ఉద్యోగోన్నతి పొంది, కదిరికే ఆ అధికారి బదిలీపై వచ్చాడు. ఆ అధికారి గతంలో ఇక్కడ అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. అయినా ఆయనను ఇక్కడికే బదిలీ చేయడం వెనుక రహస్యమేమిటని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. పలు భూ కుంభకోణాలకు పాల్పడి, జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులతో కూడా చీవాట్లు తిన్నట్లు సమాచారం. అటువంటి వ్యక్తిని కీలకమైన ఓ విభాగానికి బదిలీ చేశారు. ఆయన బదిలీపై వచ్చారా.. ఇక్కడున్న అధికార పక్షనాయకులు వేయించుకున్నారా అని టీడీపీ నాయకులు సందేహపడుతున్నారు. ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించడానికే ఇక్కడికి ఆయను బదిలీ చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ పోలీసు స్టేషన్‌లో ఓ కానిస్టేబుల్ గతంలో జరిగిన ఘర్షణ కేసులో నిందితుడు. ఇప్పటికీ ఇక్కడే పనిచేస్తున్నాడు. ఆ కానిస్టేబుల్ ఎప్పుడూ యునిఫాం కూడా వేసుకోడనీ, సివిల్ డ్రెస్‌లోనే తిరుగుతుంటాడని సమాచారం. వచ్చిన అధికారులతో లాబీయింగ్ చేయడమే అతడి పని అని పలువురు చెబుతున్నారు. అయినా ఆ కానిస్టేబుల్‌ను ఇక్కడే ఉంచడం వెనుక ఆంతర్యమేమిటని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. రెండు పార్టీల మధ్య తలెత్తిన ఘర్షణలో నిందితుడైన కానిస్టేబుల్‌ను బదిలీ చేయకపోతే అధికార పార్టీకే కొమ్ముకాసే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. తక్షణం వారిని బదిలీ చేయాలని కోరుతున్నారు. అప్పుడే నిష్పాక్షిక ఎన్నికలు సాధ్యమని అభిప్రాయపడుతున్నారు.

నత్తకు నడక నేర్పేలా..!

ఏళ్లు గడుస్తున్నా ముందుకుసాగని జాతీయ రహదారుల పనులు

- ఇప్పటికీ కొన్ని చోట్ల ప్రారంభ దశలోనే..
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే దుస్థితి
- అవస్థల నడుమ ప్రయాణాలు

అనంతపురం సిటీ, మార్చి 5: ఉమ్మడి జిల్లాలో ఏళ్లు గడుస్తున్నా జాతీయ రహదారుల పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదు. భూసేకరణ ప్రక్రియలో అధికారుల అలసత్వం కారణంగా కొన్ని చోట్ల ఇంకా ప్రారంభదశలోనే ఉన్నాయి. ఏళ్ల తరబడి నత్తనడక పనులు సాగుతుంటే.. ఇంకెన్నాళ్లు ఈ అవస్థలు అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రాప్తాడు ఆర్‌ఓబీ పనుల దుస్థితి

ఏళ్లు గడిచినా ముందుకు సాగని పనులు..

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయించి సుమారు మూడేళ్లు కావస్తున్నా.. ఎక్కడా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదు. పోనీ రూ. కోట్లలో బిల్లులు పెండింగ్ ఉన్నాయా అని.. అడిగితే.. ఆశాఖ అధికారులు కొద్దిగా మాత్రమే బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చాలా వరకు చేసిన పనులకు బిల్లులు జాప్యం కావడంతోనే పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని కొందరు కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా.. రాప్తాడు, కదిరి, ముదిగుబ్బ- పుట్టపర్తి, కదిరి-గోరంట్ల, పుట్టపర్తి -కోడూరు రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంది. గుత్తి- గుంతకల్లు- బళ్లారివైపు జాతీయ రహదారి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అక్కడ ఇబ్బందుల నడుమ ప్రయాణం చేయాల్సిన దుస్థితి. త్వరలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో ఈ పనులు జరుగుతాయో..? లేదో కూడా తెలియని పరిస్థితి.

ఉమ్మడి జిల్లాలో జరుగుతున్న కొన్ని పనుల వివరాలు, జరిగిన శాతం ఇలా..

పనుల పేరు	దూరం (కి.మీ)	నిధులు	శాతం
కదిరి బైపాస్	13 కి.మీలు	రూ. 221 కోట్లు	85
ముదిగుబ్బ బైపాస్	8	రూ. 117 కోట్లు	90
రాప్తాడు ఆర్ఓబీ	1.6	రూ. 98.55 కోట్లు	97
హిందూపురం- పరిగి రోడ్డు	20	రూ. 98 కోట్లు	85
కదిరి ఆర్ఓబీ 48ఈసీ	2.1	రూ. 69 కోట్లు	95
కదిరి 45సి	1.2	రూ. 60 కోట్లు	85
బత్తలపల్లి- ముదిగుబ్బ ఫోర్‌లేన్	33	రూ. 536 కోట్లు	65
ముదిగుబ్బ- పుట్టపర్తి రోడ్డు	32	రూ. 402 కోట్లు	50
పులివెందల-బి కొత్తపల్లి	57	రూ. 840 కోట్లు	16
కదిరి- గోరంట్ల పుట్టపర్తి - కోడూరు	47	రూ. 1319 కోట్లు	10

రూ. 65 కోట్లతో కదిరి- కుటాగూళ్ల ఆర్‌ఓబీ 1.7 కి.మీ : భూ సేకరణ స్థాయిలో
రూ. 160 కోట్లతో తాడిపత్రి బైపాస్ 6.5 కి.మీ : భూసేకరణ స్థాయిలో
రూ. 810 కోట్లతో గోరంట్ల- హిందూపురం ఫోర్‌లేన్ 34 కి.మీ : టెండర్ స్థాయి

భూ సేకరణలో జాప్యం...

ఉమ్మడి జిల్లాలోని కదిరి- కుటాగూళ్ల (ఆర్‌ఓబీ) రోడ్డు 1.7 కిలోమీటర్లకు కేంద్రం రూ.65 కోట్లు నిధులు కేటాయించింది. తాడిపత్రి బైపాస్ పనులు 6.5 కిలో మీటర్లకు రూ. 160 కోట్లు కేటాయించింది. అయితే ఈ రెండు పనులకు సంబంధిత శాఖల అధికారులు భూ సేకరణ చేయడంలో అలసత్వం ప్రదర్శిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కాగా గోరంట్ల - హిందూపురం (ఫోర్‌లేన్) రోడ్డు 34 కిలోమీటర్లకు సంబంధించి రూ. 810 కోట్లతో టెండర్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉందని ఆశాఖ అధికారుల సమాచారం.

వేగంగా జరిగేలా చూస్తాం: మురళీమోహన్, ఎన్‌హెచ్ ఎస్‌ఈ

ఉమ్మడి జిల్లాలో చాలా పనులు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పనులను పరిశీలించి వేగవంతం చేయాలని ఆయా కాంట్రాక్టర్లకు సూచిస్తున్నాం. బిల్లులు కూడా కొంత వరకు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. చాలా వరకు క్లియర్ అయ్యాయి. చివరి దశలో ఉన్న పనులపై దృష్టి సారించి త్వరగా పూర్తి చేసే విధంగా చూస్తాం. మిగిలిన పనులను కూడా వేగంగా జరిగేలా చూస్తాం.



ముదిగుబ్బ బైపాస్ రోడ్డు

వడదెబ్బతో మహిళ మృతి

రేషన్ కోసం వెళ్లి తిరిగిరాని లోకాలకు

హిందూపురం, మార్చి 5 : పట్టణ పరిధిలోని ఎస్ సడ్లపల్లిలో రేషన్ బియ్యం కోసం క్యూలో నిలబడిని చాకలి వెంకమ్మ(67) అనే మహిళ వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు స్థానికులు, బంధువులు తెలిపారు. ఇంటిం టికీ వెళ్లి వాహనం ద్వారా రేషన్ బియ్యం అందజేస్తారని ప్రభుత్వం, పాలకు లు గొప్పలు చెబుతుంటారు. కానీ పట్టణ పరిధిలోని ఎస్ సడ్లపల్లి షాపు నంబరు 29లో డీలర్ తన అనుచరుల ద్వారా కార్డుదారులకు ఇంటివద్దే రేషన్ బియ్యం అందజేస్తున్నాడు. చాకలి వెంకమ్మ అనే మహిళ బియ్యం కోసం ఆ రేషన్ షాపు వద్ద బియ్యం కోసం క్యూలో నిలబండింది. అయితే మంగళవారం ఎండ ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగిలి అక్కడికక్కడే కుప్పకూలింది. ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గ్రామస్థులు మాట్లాడుతూ డీలర్ నిర్లక్ష్యం వల్లే ఆమె వడదెబ్బ తగిలి మృతిచెందిందని, అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



మృతిచెందిన చాకలి వెంకమ్మ



డీలర్ ఇంటి వద్ద రేషన్ పంపిణీ

బీటీపీ కాలువ సకాలంలో పూర్తి చేస్తా

టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 5: నియోజకవర్గ ప్రజలకు జీవనాడి అయిన భైరవానితిప్ప బ్రాంచ్ కెనాల్ పనులను సకాలం పూర్తి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు అన్నారు. ఈ కాలువను పూర్తి చేస్తే 114 చెరువులకు నీరు అందించవచ్చునని అన్నారు. తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కాలువ పనులను సకాలంలో పూర్తి చేసేందుకు శాయ శక్తులా కృషి చేస్తానని ఆయన అన్నారు. శెట్టూరులో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కళ్యాణదుర్గం నియోజకవర్గం చాలా వెనుకబడ్డ ప్రాంతమని, రహదారులు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. ఇక్కడ ఎలాంటి అభివృద్ధి లేదని, మౌళిక సదుపాయాలు లేవని అన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమ ఒకటి ప్రతిపాదనలో ఉందంటున్నారని, రఘువీరారెడ్డి మంత్రిగా ఉన్నప్పుడు ఏపీఐఐసీ ద్వారా సుమారు వెయ్యి ఎకరాల భూమిని సేకరించినట్లు తెలిసిందని అన్నారు. ఆ పరిశ్రమను తీసుకువచ్చేందుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. రహదారులు, పాఠశాలలు, ఆస్పత్రుల ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని అన్నారు. 'మీలో ఒక్కడిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తాను' అని ఆయన అన్నారు. టీడీపీ కంచుకోటలో అత్యధిక మెజార్టీతో తన గెలిపించాలని కోరారు.

● నియోజకవర్గంలో బుధవారం నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని అమిలినేని సురేంద్రబాబు పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు. కళ్యాణదుర్గంలోని ప్రజావేదికలో వారి తో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎం.కొండాపురం, ముద్దినాయనపల్లి, ఎం.కొత్తూరులో నిజం గెలవాలి యాత్ర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లికార్జున, గోళ్ల వెంకటేశులు, పాపంపల్లి రామాంజినేయులు, డీకే రామాంజినేయులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రసంగిస్తున్న సురేంద్రబాబు

ప్రజలకు మరింత చేరువ కావాలి

- మాజీ మంత్రి పరిటాల సునీత
- ఇంటింటికీ సూపర్ సిక్స్ టేబుల్ క్యాలెండర్, బాబుతో నేను కరపత్రాల పంపిణీ

అనంతపురం అర్బన్, మార్చి 5: బాబుతో నేను కార్యక్రమాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రచారం చేసి.. ప్రజలకు మరింత చేరువ కావాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలకు మాజీ మంత్రి పరిటాల సునీత సూచించారు. మంగళవారం అనంతపురం నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని మండల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్ టేబుల్ క్యాలెండర్, బాబుతో నేను కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేయాలన్నారు. బాబుతో నేను కార్యక్రమంలో క్యూఆర్ కోడ్ స్కానర్ ఉందని, ఆ స్కానర్‌ను ఇంటింటికీ తీసుకువెళ్లి ప్రతి ఒక్కరి మొబైల్‌లో స్కాన్ చేయాలని, తద్వారా చంద్రబాబు నాయుడు హాజరయ్యే ప్రతి కార్యక్రమం వారికి చేరుతుందని అన్నారు. సూపర్ సిక్స్ ద్వారా ప్రతి ఇంటికి ఎంపిక చేసిన వలంటీర్లు వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకొని, టీడీపీ అధికారంలోకి రాగానే ఆయా కుటుంబ సభ్యులకు ఏఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకురుతుందో తెలియజేసి టేబుల్ క్యాలెండర్‌ను అందజేయాలన్నారు. ఈ టేబుల్ క్యాలెండర్ ప్రతి నిత్యం ఇంట్లో ఉంచుకునేలా రూపొందించామన్నారు. ఇందులో టీడీపీ మెనిఫెస్టోలోని అంశాలు, గతంలో చంద్రబాబు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలు ఉంటాయన్నారు. అనంతరం టేబుల్ క్యాలెండర్ కిట్లను కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్యనాయకులకు అందజేశారు.


టీడీపీలోకి చేరిన వైసీపీ ఆత్మకూరు నాయకులు

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

రాప్తాడు / ఆత్మకూరు : రాప్తాడు, ఆత్మకూరు, రామగిరి మండలాలకు చెందిన 35 కుటుంబాల సభ్యులు అనంతపురం నగరంలోని పరిటాల సునీత ఆధ్వర్యంలో ఆమె స్వగృహంలో టీడీపీలో చేరారు. రాప్తాడు మండలం బోగినేపల్లికి చెందిన నాగేంద్ర, ముత్యాలప్ప, వన్నూరప్ప, అనిల్, కేశయ్య, ఆత్మకూరు మండలంలో ఆత్మకూరుకు చెందిన మాజీ ఎంపీటీసీ తిప్పక్క, మాజీ ఉపసర్పంచ్ తిక్కస్వామి, అనిల్, నారాయణ, చిన్న ఆవన్న, ఎర్రిస్వామి, రామాంజినేయులు, నాగేంద్ర, నారాయణస్వామి, రామన్న, లక్ష్మన్న, మహేష్, రామగిరి మండలంలోని కుంటిమద్దికి చెందిన లక్ష్మీనారాయణ, గోపి, పార్థ, అరవింద్, శేషంపల్లికి చెందిన శివ, ఉప్పర నరసింహలు టీడీపీలో చేరారు. వైసీపీలో తమకు ఎలాంటి ప్రాధాన్యం లేదని, కొందరు పెత్తందార్లు చెప్పినట్లు జరుగుతోందని, అందుకే టీడీపీలోకి చేరుతున్నామని వారు తెలిపారు. పరిటాల కుటుంబంతోనే రాప్తాడు నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి, రాప్తాడు మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, భోగినేపల్లి సర్పంచ్ ఉజ్జినప్ప, నారా నారాయణ, గొల్ల ముత్యాలప్ప, బుల్లే వెంకటేష్ పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు ఖాయం

శింగనమల అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ధీమా

శింగనమల, మార్చి 5: రానున్న ఎన్నికలలో శింగనమల నియోజకవర్గంలో టీడీపీ గెలుపు ప్రభంజనం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం శింగనమల మండలంలోని రాచేపల్లి గ్రామంలో బాబూ ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటి కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. మొదట శ్రీ వెంకటేశ్వరాస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన ఆమె మాట్లాడారు. చంద్రబాబు అన్ని వర్గాలను ఆదుకునేలా సూపర్ సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. రాష్ట్రంలో జగన్ రాక్షస పాలనుకు ఓటుతో చెక్ పెట్టే సమయం ఆసన్నమైందన్నారు. టీడీపీ విజయానికి నియోజకర్గంలో నాయకులు, కార్యకర్తలు 40 రోజుల పాటు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, మాజీ ఎంపీపీలు అమృత, మూత్యాల లక్ష్మీదేవమ్మ, మాజీ జెడ్పీటీసి షాలిని, ఇంద్రవతి, ఈశ్వర్‌రెడ్డి చితంబరిదొర, రవీంద్రరెడ్డి, జయరాం, చంద్రాయుడు, విశ్వనాథరెడ్డి, చిదనందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, సత్తి, చిన్నయ్య, రాఘవరెడి, రహోతుల్లా, బాలరాజు, తిరుపాలు, ప్రసాద్, ప్రతాప్, వెంకటేశ్, పవన్, అక్బర్, వెంకటేశ్, వీనారాయణప్ప, పెద్దిరెడ్డి, అనీల్, ఎర్రిస్వామి హనుమంతురెడ్డి జీసీబాబు, ఆదినారాయణ పొరాళ్ల రవీంద్ర, గుత్తాహరి పాల్గొన్నారు.


రాచేపల్లిలో ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ


జాతీయ క్రీడాకారులతో మాంఛోఫెర్రర్

జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 5: జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు 2023-24 సీజన్‌లో జిల్లా నుంచి ఎంపికైన 33 మంది క్రీడాకారులను ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ స్థానిక అనంత క్రీడాగ్రామం ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంత జిల్లాలో ఏకంగా ఏడాదిలో 33మంది ఫుట్‌బాల్‌లో జాతీయ పోటీలకు ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, మల్లేష్, మాజీ కార్యదర్శి నాగరాజు, మేనేజర్ దాదాఖలందర్, కోచ్‌లు, అంజలి, హిందూ, ఆనంద్, మారుతి, కాంచన, బాస్కర్, చిన్నరాజా క్రీడాకారులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిధులున్నా వినియోగించుకోలేకపోతున్నాం..!


డీపీఓకు వినతి పత్రం ఇస్తున్న సర్పంచు, టీడీపీ నాయకులు

అనంతపురం రూరల్, మార్చి 5: పంచాయతీ ఖాతాల్లో నిధు లున్నా.. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేక పోవడంతో వాటిని వినియోగించుకోలేక పోతున్నా మని మన్నిల గ్రామ సర్పంచు త్రిలోక్ నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అధికారి ప్రభాకర్ రావును కలసి వినతి పత్రం ఇచ్చారు. పంచాయతీలో తాగునీటి, పారిశుధ్యం సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఆయా సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. వాటిని పరిష్కరించేందుకు పంచాయతీలో ఖాతాలో నిధులు వాడుకోలేని పరిస్థితి నెల కొందన్నారు. రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడమే ఇందుకు కారణమ న్నారు. వెంటనే రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి నియమించి పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్షావలి నాయుడు, తెలుగు రైతు మండల అధ్యక్షుడు జయప్రకాష్, సీపీఎం మండల కార్యదర్శి రామాంజినేయులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల విజేతల ఎంపిక

అనంతపురం కల్చరల్, మార్చి 5: వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం, రాయలసీమ సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల విజేతల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 125 చిత్రలేఖనాలు పోటీకి రాగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వేమన అధ్యయన అభివృద్ధి కేంద్ర కార్యాలయంలో విజేతల చిత్రలేఖనాలను ప్రదర్శించారు. ఎల్ఆర్ వెంకటరమణ, ఆర్ట్స్ కళాశాల లెక్చరర్ డాక్టర్ అంకె శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి మాట్లాడుతూ... విజేతలకు నగదు బహుమతులను ఆన్‌లైన్ ద్వారా పంపినట్లు పేర్కొన్నారు. పోటీలకు వచ్చిన చిత్రలేఖనాలను ఒక పుస్తకంగా త్వరలో వెలువరిస్తామన్నారు. కార్యక్రమంలో వేమన అధ్యయన అభివృద్ధి కేంద్రం సభ్యులు రవికుమార్, తిమ్మాపురం ప్రకాష్, మెట్టుపల్లి జయదేవ్‌రెడ్డి, డాక్టర్ వాసంతి పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికీ పోలియో చుక్కలు వేయాలి

రాప్తాడు, మార్చి 5: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని డీఎంహెచ్‌ఓ ఈబీదేవి సూచించారు. రాప్తాడు మండలంలోని కళాకారుల కాలనీలో మూడో రోజైన మంగళవారం పోలియో చుక్కలు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. రాప్తాడు మండలంలో 100 శాతం పోలియో చుక్కల కార్యక్రమం పూర్తయినట్లు వైద్యాధికారి శివకృష్ణ తెలిపారు.

ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్ సభలు

అనంతపురం క్లాక్‌టవర్ : అచ్చం పార్లమెంట్‌లో ఎంపీలు, కేంద్రమంత్రులు, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, ప్రధాన మంత్రిని తలపించేలా యూత్ పార్లమెంట్ నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాఘవేంద్ర ఫార్మసీ కాలేజీలో యూత్ పార్లమెంట్ సభలు నిర్వహిం చారు. వికసిత భారత్, ఆత్మనిర్భర్ భారత్, నారీశక్తి, ప్రధానమంత్రి శక్తి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమ లు, ఇండియా- 2047, అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ, యువత అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తి, ప్రధానమంత్రి గతిశక్తి పథకా లపై చర్చించారు. జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ యువతకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్రం ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివా సులు, జాతీయ యువ అవార్డు గ్రహీత భరత్, రైపర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభ రెడ్డి, డిప్యూ టీ తహసీల్దార్ గోపినాథ్, సభ్యులు ప్రసాత్, ప్రణతి, జీవన్‌కుమార్, వినోద్‌కుమార్, నాగభూ షణ, సత్య, సౌమ్య, మోహన్ కృష్ణ, ఉషారాణి పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై సమీక్ష

రాప్తాడు/శింగనమల : రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వసంత్‌బాబు, శింగనమల తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల మంగళవారం ఎన్నికల విధులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ఏఈఆర్వోలు, సెక్టోరియల్ అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని, వివాద పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించారు.

ఎస్సీల ద్రోహి జగన్‌రెడ్డి

జనసేన జిల్లా అధ్యక్షుడు వరుణ్ ధ్వజం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5: ఎన్నికలకు ముందు ఎస్సీలు... నా మేనమా మలు అని చెప్పుకున్న వైఎస్ జగన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఎస్సీల ద్రోహిగా మారారని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ మండిపడ్డారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ ప్రజా సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహిం చిన బస్సు యాత్రను నగరంలో ప్రారంభిం చిన ఆయన మాట్లాడారు. ఎస్సీల అభ్యున్న తికి గత ప్రభుత్వాలు అమలు చేస్తున్న 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసిందన్నారు. జనసేన, టీడీపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేసిన ఆ పథకాలతో పాటు మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ఎస్సీలకు జగన్మోహన్‌రెడ్డి చేసిన మోసాన్ని వివరించి ప్రజలను చైతన్యం చేయడం కోసమే ఎస్సీ, ఎస్టీ ప్రజా సమైఖ్య ఆధ్వర్యంలో ఈ బస్సు యాత్ర చేపట్టడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ప్రజా సమైక్య అధ్యక్షుడు మద్దలచెరువు మల్లి, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా అధికార ప్రతినిధి సాకే మురళీ, ఎస్సీ సంఘాల నాయకులు మన్నల పెద్దిరాజు, కల్లూరు ప్రసాద్, ముత్యాలు, రాచేపల్లి శ్రీనివాసులు, శ్రీనాథ్, సాకే హరి, గడ్డం ముత్యాలు, జనసేన నాయకులు కిరణ్ కుమార్, కుమ్మరి మురలీ, సంపత్, ఆకుల అశోక్, దంపెట్ల శివ, విజయ్ రాయల్, వినయ్, నౌషాద్ పాల్గొన్నారు.


బస్సు యాత్రను ప్రారంభిస్తున్న టీసీ వరుణ్

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు విరాళం

అనంతపురం రూరల్: రుద్రంపేట పంచాయతీలోని వికలాంగుకాలనీలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ్ భక్త హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠకు టీసీ వరుణ్ రూ. 20 వేలు విరాళం అందజేశారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

అనంతపురం కల్చరల్, మార్చి 5: సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ ఉషారాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐద్వా, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలు ధైర్యంతో ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ నేపథ్యంపై రూపొందించిన 'ధీర' పుస్తకాన్ని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శంకరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మ, అరుణమ్మ, ప్రజానాట్య మండలి కృష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కన్వీనర్ ఫాతిమా బేగం, పర్వీన్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఎస్ఎఫ్ఐ ఉమెన్ వింగ్ కన్వీనర్ రజిత, సిద్దు, గిరి, సోము, గణేష్, బాలరాజు, రాధా పాల్గొన్నారు.


ధీర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు, విద్యార్థులు

ఎస్కేయూ ఉద్యోగులకు వైద్య పరీక్షలు

అనంతపురం సెంట్రల్ : ఎస్కేయూ ఉద్యోగులకు బీపీ, షుగర్, గుండె తదితర వైద్య పరీక్షలను నిర్వహించారు. మంగళవారం వర్సిటీ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వీసీ హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య ప్రారంభించారు. ఇందులో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వరలక్ష్మి, ఇంజనీరింగ్, ఫార్మసి కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రామచంద్ర, సోమశేఖర్ పాల్గొన్నారు.

మోడల్ టెస్ట్‌లో ఉత్తీర్ణులకు బహుమతులు

అనంతపురం విద్య: ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి మెడల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులను ఆ సంఘం నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజ్‌లో ఆ విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరసింహ, కార్యదర్శి అబ్దుల్ ఆలం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ప్రిన్సిపాల్ రంగస్వామి, డాన్స్ మాస్టర్ కత్తి విజయ్‌కుమాంర్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు ప్రతిభ భారతి, సుమాంజలి, సంధ్య, పవన్ కళ్యాణ్, షామీర్, నరసింహ, మహబూబ్ వలి పాల్గొన్నారు.

శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమించాలి

అనంతపురం సెంట్రల్ : ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో పీహెచ్‌డీ, నెట్, స్లెట్ అర్హతతో శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమించాలని ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన ఆయన మాట్లాడారు. కళాశాలల యాజమాన్యాలు యూజీసీ, ప్రభుత్వ నిబంధనలు విస్మరించి అర్హతలేని వారిని అధ్యాపకులుగా నియమించుకుంటున్నాయన్నారు. నెలవారి వేతనాలివ్వకుండా సెమిస్టర్, సబ్జెక్టు ప్రకారం చెల్లిస్తూ చేతులు దులుపుకుంటున్నాయని మండిపడ్డారు. దీంతో అధ్యాపకులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. వర్సిటీ యాజమాన్యమే ర్యాటిఫికేషన్ నిర్వహించి శాశ్వత ప్రాతిపదికన అధ్యాపకులను నియమించాలని కోరారు.

నర్సింగ్ సూపరింటెండెంట్ మంజుల బదిలీ

అనంతపురం టౌన్: జిల్లా సర్వజన ఆస్పత్రి నర్సింగ్ సూపరింటెండెంట్ మంజులపై బదిలీ వేటు వేసారు. ఇటీవల స్టాఫ్ నర్సులు, ఆమె మధ్య విబేధాలు రావడంతో కలెక్టరు ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకొని మంజులను అన్నమయ్య జిల్లా మదనపల్లి ఆస్పత్రికి బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తెలిపారు

హాస్టల్ ఫీజులు తగ్గించాలి

అనంతపురం సెంట్రల్ : ఆర్ట్స్ కళాశాలలో హాస్టల్ ఫీజుల భారాన్ని తగ్గించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయిస్వామి, రమణ మాట్లాడారు. హాస్టల్స్‌లో నెలకు దాదాపు రూ.2వేల వరకు మెస్‌చార్జీలు వస్తాయని, అయితే ఆర్ట్స్ కళాశాలలో మాత్రం రెండు నెలలకే రూ.10వేల ఫీజు వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. ఇంత మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నా.. నాణ్యమైన భోజనాన్ని అందించకుండా కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేలా అధికారులు పనిచేయడం దుర్మార్గమన్నారు. ఇందుకు స్పందించిన ప్రిన్సిపాల్ విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, నరసింహయాదవ్, వంశీ, ఉమామహేష్, హరికృష్ణ పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై దిగివచ్చిన ఎస్కేయూ

అనంతపురం సెంట్రల్: తమ సమస్యలు పరిష్కరించాలని ఎస్కేయూ కాంట్రాక్ట్ మినిమం స్కేల్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం నిర్వహించిన సమ్మెకు ఎస్కేయూ యాజమాన్యం దిగివచ్చింది. ఆ సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చింది. వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య పలుహామీలు ఇచ్చారని కార్యదర్శి మంజునాథ్ నాయక్ తెలిపారు. పాలకమండలి సమావేశంలో సమస్యలను ఎజెండాగా పెట్టుకుని పరిష్కరిస్తామని తెలిపారన్నారు. అదేవిధంగా జీతాల పెంపుపై ప్రత్యేక కమిటీని నియమించి రూ.20వేలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, కారుణ్య నియామకాల ద్వారా బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. దీంతో సామూహిక సమ్మెను తాత్కాలికంగా విరమించి విధుల్లో చేరుతామన్నారు.

9న మహాగర్జనకు తరలిరండి

గార్లదిన్నె : దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న చేపట్టిన చలో అమరావతి మహా గర్జనకు తరలిరావాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి కళామండలి జిల్లా అధ్యక్షుడు కొప్పలకొండ పుల్లన్న, ఎమార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు జగ్గుల స్వాతంత్రకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం వారు స్థానిక మీడియాతో మాట్లా డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజినేయులు, అరుణోదయ మండల సమైఖ్య అధ్యక్షులు యల్లమ్మ, నాగభూషణం, గుర్వ, గాదిలింగప్ప, నాగమణి, వన్నూరమ్మ పాల్గొన్నారు.

మాఘమాస ప్రత్యేక పూజలు



ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మంగళవారం మాఘమాస పూజలు నిర్వహించారు. స్వామివారికి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, బంగారు కవచఅలంకరణ చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వకుంటే ప్రాణత్యాగమే

ఆమరణ దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు


దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నార్పల, మార్చి 5: నార్పలలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే ప్రాణత్యాగాలకు సిద్ధమని ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప, రామాంజినేయులు హెచ్చరించారు. మంగళవారం నార్పలలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన వారు మాట్లాడారు. నార్పల ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీలో స్థలాలను కొందరు వైసీపీ నాయకులు విక్ర యించారన్నారు. మరికొందరు వైసీపీ నేతలు ఆక్రమంగా ఇళ్ల స్థలాలను కబ్జా చేశారన్నారు. వెంటనే అలాంటి అక్రమాలను గుర్తించి అర్హులకు న్యాయం చేయా లని, లేకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జయరాం, రమణ, కుల్లాయప్ప పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 32 మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురంరూరల్,మార్చి 5: పీవీకేకే ఐటీ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో 32మంది విద్యార్థులకు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. మంగళవారం గేబ్రియల్ అండ్ హిటాచి కంపెనీ ఆన్‌క్యాంపస్ ప్లేస్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో ఈసీఈ, ఈఈఈ మెకానికల్ విభాగానికి సంబంధించిన 32 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఆ విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, ఇతర యాజమాన్య సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి జయచంద్ర, రోజాచ వేంకటేషులు, జయలక్ష్మి పాల్గొన్నారు.

కియలో యువకుడి హఠాన్మరణం

పెనుకొండ రూరల్, మార్చి 5: పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమలో ఫిట్టర్‌గా పనిచేస్తున్న సాయిలింగ (25) సోమవారం హఠాన్మరణం చెందాడు. అనంతపురం రూరల్ మండలంలోని రాచానపల్లి గ్రామానికి చెందిన చాకలి సుబ్బయ్య, పార్వతమ్మల కుమారుడు సాయిలింగ రెండేళ్లుగా కియ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. సోమవారం విధుల్లో ఉన్న అతను ఉన్నపళంగా ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. తోటి ఉద్యోగులు హుటాహుటిన అనంతపురం సవేరా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మరణించినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు కియా ఎస్ఐ రంగడు తెలిపారు.

పిల్లల కిడ్నాప్ కేసులో 3 నెలల జైలు శిక్ష

అనంతపురం క్రైం : ప్రభుత్వాసుపత్రిలో చిన్న పిల్లల కిడ్నాప్ కేసులో మూడు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. 2017లో అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో నగరంలోని మసీదు కొట్టాలకు చెందిన రామంజి కుమారుడు ఆరేళ్ల ఎం.జయచంద్రను కనగానపల్లి మండలం తూముచెర్ల గ్రామానికి చెందిన కొలిమి కుతిజ (ప్రస్తుతం కొడిమి కొట్టాలలో నివాసం) కిడ్నాప్ చేసింది. ఈ ఘటనపై నాడు అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మొదటి అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పవిత్ర కేసు విచారణ జరిపారు. నేరం రుజువు కావడంతో మూడు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు.

అధ్యాపకులకు ముగిసిన శిక్షణ


అధ్యాపకులతో ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, మార్చి 5: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల వృక్ష, సూక్ష్మజీవ శాస్త్రం అధ్యాపకులకు ఆరు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు మంగళవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులతో పరిశోధనాత్మకంగా చర్చించినప్పుడే ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం అధ్యాపకులకు శిక్షణా తరగతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌సీ కోఆర్డినేటర్ లక్ష్మీకాంతం, వృక్షశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

డెయిరీ కేంద్రాల పరిశీలన

రాప్తాడు, మార్చి 5: జగనన్న పాల వెల్లువ కార్యక్రమానికి పాల సేకరించే హంపాపురం, బుక్కచెర్ల పాల డెయిరీ కేంద్రాలను మంగళవారం జడ్పీసీఈఓ నదియాదేవి మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట ఈఓఆర్డీ నరసింహారెడ్డి, బండమీదపల్లి పశువైద్యాధికారి సోమేశ్వరి ఉన్నారు.

విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

- జనసేన నాయకురాలు పెండ్యాల శ్రీలత

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 5: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజాశక్తి నగర్, బీజేపీ కొట్టాలలో ప్రమాదాలు జరిగాయని జనసేన మహిళా విభాగం రాయలసీమ కన్వీనర్ పెండ్యాల శ్రీలత అన్నారు. విద్యుదాఘాతంతో గాయపడి, ఇంటికి పరిమితమైన పెయింటర్ షెక్షావలిని మంగళవారం ఆమె పరామర్శించారు. తనవంతుగా రూ.5 వేలు సాయం అందజేశారు. ఇళ్ల గోడలకు, వస్తువులకు కరెంటు సరఫరా అవుతోందని తెలిసినా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయలేదని అన్నారు. ప్రమాదం కారణంగా ఉపాధి కోల్పోయిన బాధితుడిని అధికారులు ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీర మహిళలు పాల్గొన్నారు.


షెక్షావలి చేతికి అయిన గాయాలను పరిశీలిస్తున్న శ్రీలత

ఘనంగా పొలిమేర పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఆత్మకూరు మార్చి 5: మండలంలోని పి సిద్దరాంపురం గ్రామ పొలిమేరలో మంగళవారం పొలిమేర పెద్దమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



దశకంఠుడిపై నీలకంఠుడి దర్శనం

అనంతపురం కల్చరల్, మార్చి 5: స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజున మంగళవారం దశకంఠుడైన రావణ బ్రహ్మ వాహనంపై శివపార్వతులు ఊరేగారు. ఆలయంలో ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి మూలవిరాట్‌కు వివిధరకాల పుష్పాలంకరణలు, ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహ నంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి శివపార్వతులుగా అలంకరించి మొదటిరోడ్డు, రెండవ రోడ్లమీదుగా ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని వేదికపై శ్రీ నృత్యకళానిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి శిష్యబృందం సంప్రదాయ నృత్యాలతో అలరించారు.



భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, మార్చి 5: నియోజక వర్గంలోని గుత్తి మండలంలో గురువారం నారా భువనేశ్వరి పర్యటనను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక గుత్తి మండలం ధర్మాపురం, బేతాపల్లి గ్రామాలలో పార్టీకి చెందిన ఇద్దరు మృతి చెందారన్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడానికి చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఏడో తేదీన ఆయా గ్రామాలలో పర్యటిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రెండవ వారంలో పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ కూడా గుత్తికి శంఖారావం కార్యక్రమం కోసం వస్తారని, అందులోనూ పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, శ్రీనాథ్ గౌడు, అనిల్ కుమార్ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, హనుమంతు, పాల మల్లికార్జున, కౌన్సిలర్లు కృపాకర్, షరీఫ్, శివన్న, లక్ష్మీదేవి, మాధవి, రామన్న చౌదరి, మహదేశ్, లక్ష్మీనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

నేడు నారా భువనేశ్వరి రాక

కణేకల్లు, మార్చి 5: మండలంలోని గోపులాపురం గ్రామానికి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి బుధవారం వస్తున్నట్లు పార్టీ కన్వీనర్ లాలెప్ప, తెలుగుయువత అధ్యక్షుడు బాయినేని నవీన్‌లు తెలిపారు. చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక గ్రామానికి చెందిన తలారి వన్నూరప్ప చనిపోయాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చేందుకు ఆమె వస్తున్నట్లు వారు చెప్పారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు భువనేశ్వరి గోపులాపురం గ్రామానికి రానుండగా అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ గరికపాటి బసవరాజు తెలిపారు.

నా విజయానికి సహకరించండి


ఉన్నం హనుమంతరాయ చౌదరితో చర్చిస్తున్న అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 5: నియోజక వర్గంలో తన విజయానికి సహకరించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం హనుమంత రాయ చౌదరిని కోరారు. మంగళవారం యర్రంపల్లిలో ఉన్నంను అమిలినేని సురేంద్రబాబు కలిశారు. పార్టీ స్థితిగతులపై ఇద్దరు చర్చించారు.

చికిత్స పొందుతూ ప్రియురాలు మృతి

కళ్యాణదుర్గం, మార్చి 5: ప్రేమికుడు ఆత్మహత్య చేసుకోవడాన్ని భరించలేక ఆత్మహత్యకు యత్నించిన ప్రియురాలు(22) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కంబదూరు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా.. కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన హరిభూషణ్ (25), ఓ యువతి ప్రేమించుకున్నారు. తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోరని మనస్తాపం చెందిన హరిభూషణ్ బహిర్భూమికని వెళ్లి ఈ నెల 2న చెట్టుకు ఉరివేసుకుని గుద్దెళ్ల గ్రామంలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని తట్టుకోలేని ప్రియురాలు పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ యువతి మృతి చెందింది. కంబదూరు ఎస్ఐ ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు


అప్పారావును పరామర్శిస్తున్న కాలవ భరత్

బొమ్మనహాళ్, మార్చి 5: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు అప్పారావును మంగళవారం ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే పరోక్షంగా, ప్రత్యక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయ న్నారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, బలరాంరెడ్డి, ఎర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, మాలపాటి ధనుంజయ, నాగరాజు, పయ్యా వుల మోహన్, పయ్యావుల అనిల్, ప్రభు, గోవింద, రాము పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బదిలీ

రాయదుర్గంరూరల్, మార్చి 5: స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు గుమ్మఘట్ట తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రఘు రాయదుర్గం డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు.

టైలర్స్‌కాలనీలో భవిష్యత్తుకు గ్యారెంటీ


మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ కౌన్సిలర్లు

తాడిపత్రిటౌన్, మార్చి5: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం టీడీపీ కౌన్సిలర్లు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మేనిఫెస్టోలోని అంశాలను అమలుచేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్లు సరస్వతి, అబ్దుల్‌రహీం, టీడీపీ కౌన్సిలర్లు విజయ్‌కుమార్, మల్లికార్జున, షెక్షావలి, సురేష్, రేష్మాపర్వీన్, అరుణ, కో ఆప్షన్ సభ్యులు బింగి ప్రభాకర్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువు కలిపిన నీరు తాగి జీవాల మృతి


గొర్రెల కళేబరాలను పరిశీలిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం, మార్చి 5: మండలంలోని గోవిందదొడ్డి పంచాయతీకి చెందిన బొమ్మయ్య, రామానుజులుకు చెందిన ఆరు గొర్రెలు, ఏడు మేకలు మంగళవారం ఎరువు కలిపిన నీరు తాగి మృతి చెందినట్లు పశువైద్యాధికారి నవీన్ కుమార్ తెలిపారు. ఇందులో రెండు గొర్రెలు, రెండు మేకలకు వైఎస్సార్ పశు బీమా కింద ఒక్కొక్క దానికి రూ. 6 వేలు వచ్చేలా సిఫారసు చేసినట్లు ఆయన తెలిపారు.

యువచైతన్య బస్సుయాత్ర ప్రారంభం


యర్రగుంటపల్లిలో పర్యటిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రిటౌన్, మార్చి5: మండలంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి యువచైతన్య బస్సుయాత్ర ప్రారంభమైంది. యర్రగుంటపల్లి, రావివెంకటాంపల్లి, చిన్నపల్లి, తాతగారిపల్లి, కోమలి, పెద్దపొలమడ, చిన్నపొలమడ గ్రామాల్లో బస్సుయాత్ర సాగింది. ప్రతి గ్రామంలో జేసీ ప్రభాకర్‌రెడ్డికి మహిళలు, యువకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల ప్రజల సమస్యల గురించి ఆరాతీశారు. అనంతరం టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్‌కు ఓటువేసి అభివృద్ధికి పాటుపడాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోలోని అంశాలను అమలు చేస్తామన్నారు. వైసీపీ పాలన అంతా అరాచకం, గొడవలు, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా సాగుతోందన్నారు. యాత్రలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి అందరిని పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. కార్యక్రమంలో యర్రగుంటపల్లి సర్పంచు యుగంధర్, జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చింబిలి ప్రసాద్, నరేంద్రనాయుడు, జగన్నాథ్ రెడ్డి, సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, జయరామిరెడ్డి, ఓబులేసుయాదవ్, సురేష్, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వృద్ధున్ని పలకరిస్తున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

బాధిత కుటుంబానికి అశ్మిత్‌రెడ్డి పరామర్శ

పెద్దపప్పూరు: మండలంలోని చాగల్లు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

సీపీఎస్ రద్దును టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలి

●ఎమ్మెల్యే కేశవ్‌ను కోరిన యూటీఎఫ్ నాయకులు


కేశవ్‌కు వినతి పత్రాన్ని ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉరవకొండ, మార్చి 5: సీపీఎస్ రద్దు అంశాన్ని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌ను యూటీఎఫ్ నాయకులు కోరారు. మండలంలోని కౌకుంట్లలో ఎమ్మెల్యే కేశవ్‌ను మంగళవారం యూటీఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు. రాష్ట్రంలో రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో వివిధ శాఖల్లో 11లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పనిచేస్తున్నారన్నారు. వీరి లో ఐదున్నర లక్షల మంది రెగ్యులర్ ఉద్యోగులు కాగా మిగిలిన వా రంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులన్నారు. రెగ్యులర్ ఉద్యోగుల్లో 3లక్షల మందికి 2004లో ప్రారంభమైన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలు జరుగుతోందన్నారు. దీని వల్ల జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాయన్నారు. ఏపీలో కూడా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి పెన్షన్, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామప్ప చౌదరి, జయ రాములు, శ్రీనివాసులు, రఘు, లక్ష్మీనారాయణ, ఉమాపతి, నాగరాజు, రాము, వేణు, శ్రీధర్, రామచంద్ర, నరసింహులు, రవి, తిప్పన్న పాల్గొన్నారు.

వలంటీర్ల ప్రచారాన్ని అరికట్టండి: టీడీపీ


వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

యాడికి, మార్చి5: వైసీపీ నాయకులతో కలిసి వలంటీర్లు కొనసాగిస్తున్న ప్రచారాన్ని అరికట్టాలని కోరుతూ పలువురు టీడీపీ నాయకులు మంగళవారం ఈఓపీ ఆర్డీ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాడికిలో కొందరు వలంటీర్లు వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. ఓటరు జాబితాను తీసుకొని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలమేరకు వలంటీర్లు ప్రచారంలో పాల్గొనకూడదని తెలిపారు. కొందరు వలంటీర్లు నిబంధనలను తుంగలో తొక్కి వైసీపీ నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, ఆదినారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రంగస్వామి, హుస్సేన్‌వలి, ప్రవీణ్ కుమార్, ఆంజనేయులు, రాజు తదతరులు ఉన్నారు.

పాల్గొంటే కఠిన చర్యలు: ఎంపీడీఓ

వలంటీర్లు పార్టీల ప్రచారంలో పాల్గొంటే ఎన్నికల నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ సావిత్రి గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు-2024 నియమావళి ప్రకారం పార్టీలకు సంబంధించిన ప్రచారంలో ఎటువంటి కార్యక్రమాల్లో గానీ వలంటీర్లు పాల్గొనరాదని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఎలక్షన్ యాక్ట్ ప్రకారం తీవ్రమైన చర్య తీసుకుంటామని పేర్కొన్నారు. ఉత్తర్వు కాపీలను అన్ని సచివాలయాల వద్ద నోటీసుబోర్డులో అంటించారు.

ఇచ్చిన భూమిని చూపండి

విడపనకల్లు, మార్చి 5: మండలంలోని కరకముక్కల గ్రామానికి చెందిన దళితుల భూములకు సరిహద్దులు చూపాలంటూ దండోర జిల్లా కార్యవర్గ సభ్యుడు కెంగూరి ఎర్రిస్వామి, మంగళవారం తహసీల్దారు దస్తగిరి సాబ్‌కు వినతి పత్రాన్ని అందించారు. దండోర నాయకులు మాట్లాడుతూ కరకముక్కల గ్రామంలోని 20మంది ఎస్సీలకు(దళితులకు) 1992వ సంవత్సరం అసైన్డ్ భూమిని 405 సర్వే నంబరులో పంపిణీ చేశారన్నారు. అప్పుడు ఒక్కొక్కరికి రెండు ఎకరాలు ప్రకారం డీ పట్టాలు ఇచ్చారన్నారు. కానీ డీ పట్టాలలో ఉన్న కొలతలు ప్రకారం భూమిని చూపకుండా ఒక్కొక్క రైతుకు 1.10 సెంట్లు ప్రకారం చూపించారు అన్నారు. మిగిలిన భూమిని ఇతరులు ఆక్రమించుకొని సాగు చేస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. దళితులకు ఇచ్చిన భూమిని డీ పట్టా ప్రకారం కొలతలు వేసి రెండు ఎకరాలు చూపించాలని కోరారు. ఈ విషయమై తహస్దీరు దస్తగిరి సాబ్ మాట్లాడుతూ విచారించి అందరికి న్యాయం చేస్తామన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 5: వేర్వేరు దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని అనంతపురం సెబ్ ఇంటెలిజెన్స్ సీఐ కృష్ణ, కంబదూరు సెబ్, కళ్యాణదుర్గం సెబ్ ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్నారు. కంబదూరు మండలం వంటారెడ్డిపల్లి, కురాకులపల్లి, కళ్యాణదుర్గం మండలం ఉప్పంక, బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లి సమీపంలో సోమవారం రాత్రి, మంగళవారం జరిగిన దాడుల్లో 24 బీర్ బాటిళ్లు, 48 ఎంఎల్ క్వార్టర్ బాటిళ్లు, 489 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో కంబదూరు సెబ్ సీఐ టాకీ బాషా, కళ్యాణదుర్గం సెబ్ సీఐ వెంకట్, అనంతపురం డీటీఎఫ్ సీఐ వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డైట్ బిల్లులు చెల్లించాలి

గుత్తి, మార్చి 5: సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో ఏడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లును ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. డైట్ బిల్లులు ఏడు నెలలుగా బకాయిలు చెల్లించకపోవడంతో వార్డెన్లు అప్పులు తెచ్చి అన్నం పెట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాజా, కృష్ణ, ధనుంజయ, రామ్మోహన్, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఎవరేమనుకుంటే మాకేంటి !

ప్రొటోకాల్ పాటించకుండా వైసీపీ నాయకుల పట్టాల పంపిణీ


ఎంపీటీసీ చిక్కణ్ణను మరుగున చేసి పట్టాలు ఇస్తున్న మెట్టు గోవిందరెడ్డి, వైసీపీ నాయకులు

బొమ్మనహాళ్, మార్చి 5: మండలంలోని నేమకల్లు గ్రామంలో భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక సర్పంచ్ పరమేష్, కో ఆప్షన్ మెంబర్ మహబూబ్ బాషా, ఎంపీటీసీ చిక్కణ్ణలు మాత్రమే ప్రజాప్రతినిధులుగా హాజరయ్యారు. వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, ఎంపీపీ పద్మ భర్త చంద్రశేఖర్‌రెడ్డి వివిధ గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు వేదికపై ఉండి ఉపన్యాసాలు ఇచ్చి పట్టాల పంపిణీ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా అధికారులు నాయకులతో కలిసి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేమకల్లు గ్రామంలో 57 మందికి 74.78 ఎకరాల విస్తీర్ణంలో భూముల పట్టాలు ఇచ్చినట్లు వీఆర్వో తిమ్మప్ప తెలిపారు.

భోగాలకట్టలో వ్యక్తిపై దాడి

యాడికి, మార్చి5: మండలంలోని భోగాలకట్ట గ్రామంలో బాబయ్య అనే వ్యక్తిపై దాడి చేసిన సంఘటనలో అదే గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. సీఐ తెలిపిన మేరకు భోగాలకట్ట గ్రామానికి చెందిన బాబయ్య ఫొటోషాపు ద్వారా జీవనం పొందుతున్నాడన్నారు. రెండురోజుల కిందట అదే గ్రామానికి చెందిన ప్రతాప్, శివకృష్ణ, విశ్వనాథ్, నాగమణి, మల్లీశ్వరి దాడిచేసి కొట్టారని తెలిపారు. ఈ సంఘటనలో బాబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బాబయ్య తల్లి బీబీ ఫిర్యాదు మేరకు ఐదుమందిపై కేసునమోదుచేశామని సీఐ తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించాడని ఫిర్యాదు

తనపట్ల బాబయ్య అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని భోగాలకట్ట గ్రామానికి చెందిన నాగమణి అనే మహిళ ఇచ్చిన ఫిర్యాదుమేరకు బాబయ్యపై కేసు నమోదు చేశామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు.

గుత్తి ప్రజల దాహార్తి తీర్చడంలో ఎమ్మెల్యే విఫలం: జనసేన


మాట్లాడుతున్న వాసగిరి మణికంఠ

గుత్తి, మార్చి 5: పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి పెనకచెర్ల డ్యాం నుంచి ఏర్పాటు చేస్తున్న సమగ్ర తాగునీటి సరఫరా పథకాన్ని పూర్తి చేయడంలో ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి ఘోరంగా విఫలమయ్యారని జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త వాసగిరి మణికంఠ పేర్కొన్నారు. పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో రూ.173 కోట్లతో ఏర్పాటు చేస్తున్న జీడబ్ల్యూఎస్సీ సమగ్ర తాగునీటి పథకం నిర్మాణం పనులను జనసేన నాయకులు మంగళవారం పరిశీలించారు. అనంతరం స్థానిక అర్ అండ్‌బీ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో నిర్వహించి ఎమ్మెల్యే తీరును తూర్పారబట్టారు. నియోజకవర్గంలోని పామిడి, గుత్తిలో నెలకొన్న నీటి సమస్యను నివారించేందుకు టీడీపీ పాలనలో సమగ్ర తాగునీటి పథకం ప్రాజెక్ట్ కోసం రూ.173కోట్లు కేటాయించి టెండరు ప్రక్రియ పూర్తి చేసిందన్నారు. పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ఈ ప్రాజెక్ట్ పట్ల నిర్లక్ష్యం వ్యవహరించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. గుత్తికి తాగునీటి సమస్య పరిష్కరించడంలో, గుత్తి చెరువుకు నీరు తెప్పించడంలో, మున్సిపల్ కార్యాలయం నూతన భవనం నిర్మాణం చేపట్టడంలో, ఫోర్‌వే రోడ్డు పనులు చేయించడంలో ఎమ్మెల్యే ఘోరంగా విఫలం అయ్యారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో జన సేన పార్టీ పట్టణ అధ్యక్షుడు పాటిల్ సురేష్, నాయకులు చిన్నవెంకటేశులు, బ్రహ్మయ్య, వెంకటపతి, నాగయ్య, కార్తీక్, హుసేన్, కృష్ణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమం: జేసీ


సామగ్రిని అందిస్తున్న జేసీ దివాకర్‌రెడ్డి

యాడికి, మార్చి5: టీడీపీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం యాడికిలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీకి సంబంధించిన ప్రచార సామగ్రిని పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమష్టిగా పనిచేసి టీడీపీని గెలిపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదినారాయణ, రూపునేని రాజశేఖర్, మనోహర్‌చౌదరి, తిరంపురం నీలకంఠ, లక్ష్మణ్, నారాయణస్వామి, బొట్టు శేఖర్, మధురాజు, రామాంజనేయులు, విజయ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవిని దర్శించుకున్న మాజీ ఎంపీ జేసీ

యాడికిలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారిని మంగళవారం జేసీ దివాకర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

కసాపురం హుండీ ఆదాయం రూ.48 లక్షలు

గుంతకల్లు, మార్చి5: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి వివిధ హుండీల ద్వారా రూ. 48 లక్షల ఆదాయం లభించిందని ఈఓ భద్రాజీ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం ఎండోమెంటు పరిశీలకుడు, ధర్మకర్తల సమక్షంలో ఆలయ హుండీలను తెరిచారు. ప్రధాన హుండీల ద్వారా రూ. 48,00,793లు, అన్నదానం హుండీల ద్వారా రూ. 75,189లు, 6.5 గ్రాముల బంగారం, 220 గ్రాముల వెండి 34 అమెరికన్ డాలర్లు, ఐదు చైనా ఎన్‌లు వచ్చినట్లు తెలియజేశారు. డిసెంబరు 27 నుంచి ఈ నెల 4 వరకూ 69 రోజుల్లో భక్తులు ఈ మొత్తాలను హుండీలలో వేశారన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్మన్ సుగుణమ్మ, ఏఈఓ మల్లికార్జున, సూపరింటెండెంటు పీ వెంకటేశులు, ధర్మకర్తలు, సిబ్బంది, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు అధికారులు వలంటీర్లు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో బాబు ష్యూరిటీ


ఎద్దులబండిపై ఊరేగింపుగా వస్తున్న విక్రమ్ సింహా

బెళుగుప్ప, మార్చి 5: మండలంలోని శ్రీరంగాపురం బూదవర్తి గ్రామాల్లో ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్‌సింహా బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను ఎద్దులబండిపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

కూడేరు: మండలంలోని ఎంఎంహళ్లి, జయపురం గ్రామంలో విజయ్ సింహ ఆధ్వర్యంలో మంగళవారం బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే జరిగే అభివృద్ధి గురించి వివరించారు.

నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

ఉరవకొండ: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఈ మేరకు కలెక్టర్ గౌతమికి మంగళవారం ఆయన లేఖ రాశారు. ఇప్పటికే ఉరవకొండలో 6నుంచి 10రోజులకు ఒకసారి నీటిని వదులుతున్నారన్నారు. తాగు నీటి సమస్య అధికమవుతున్నందున ఇబ్బందులు కలిగే అవకాశం ఉందన్నారు. హంద్రీనీవాలో నీటి లభ్యత ఉన్నందున కాలువ నుంచి నీటిని పంప్ చేసి నింబగల్లు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నింపాలన్నారన్నారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోకి నీటిని నింపడం వల్ల వేసవిలో కొంత వరకూ ఉపశమనం లభించే అవకాశం ఉందన్నారు. తక్షణమే చర్యలు చేపట్టేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలన్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ఉరవకొండ,మార్చి5: పట్టణంలోని పదో వార్డులో నివాసం ఉంటున్న అనిత(34) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందింది. భాస్కర్ ప్రైవేట్ డ్రైవర్‌గా, అనిత టైలరింగ్ చేస్తూ జీవించేవారు. అనిత ఉదయం ఇంటిని శుభ్రం చేస్తుండగా కుట్టు మిషన్ మోటారుకు ఉన్న వైర్లను పక్కకు జరుపుతున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురైంది. అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కరపత్రం కలకలం



తాడిపత్రిటౌన్, మార్చి5: పట్టణంలో మరోసారి వైఎస్ఆర్ వాటర్ ప్లాంట్లపై టీడీపీ కౌన్సిలర్ల పేరిట ప్రచురించిన కరపత్రం మంగళవారం కలకలం రేపింది. కరపత్రంలో ఉన్న అంశాలను పరిశీలిస్తే.... తాడిపత్రిలో రూ.1.85కోట్లు ఖర్చు పెట్టి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు, అందులోని సామగ్రి తుప్పుపడుతున్నాయని పేర్కొన్నారు. ఓ ప్రజా ప్రతినిధి ఇంటివద్ద ఉన్న వాటర్‌ప్లాంట్ నుంచి తన ఇంటికి కరెంట్ వాడుకోవడంతో రూ.1,18,744 విద్యుత్ బకాయి పడ్డారని కరపత్రంలో రాశారు. బకాయిపడ్డ విద్యుత్‌బిల్లును చెల్లించాలని ట్రాన్స్‌కో అధికారులు పంపిన లెటర్‌ను కరపత్రంలో ప్రింట్ చేయడం గమనార్హం. వాటర్ క్యాన్ రూ.2లకే అందిస్తామని చెప్పి పథకం ప్రారంభించిన ఆరునెలలకే వాటర్‌ప్లాంట్లు అటకెక్కాయని, ప్లాంట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని సైతం వదల్లేదని కరపత్రంలో పేర్కొన్నారు. పట్టణంలోని కాల్వ గడ్డవీధి, నందలపాడు, టైలర్స్‌కాలనీ, గాంధీకట్ట సమీపంలో ఏర్పాటుచేసిన వైఎస్ఆర్ వాటర్‌ప్లాంట్లు మూతపడ్డాయని కరప త్రంలో పేర్కొన్నారు. కరపత్రాలను టీడీపీ మద్దతుదారులు పంచుతున్నారన్న విషయం తెలుసుకున్న వైసీపీ మద్దతుదారులు సంఘటనస్థలానికి వస్తున్నా రన్న సమాచారంతో పోలీసులు అక్కడికి రావడంతో ఇరువర్గాల మద్దతు దారులు కనిపించలేదు.

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్


స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

గుంతకల్లు టౌన్, మార్చి 5: పట్టణంలోని మార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంలను మంగళవారం సాయంత్రం కలెక్టర్ గౌతమి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు యార్కెట్ యార్డులో ఈవీఎంలను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూంలను పరిశీలించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూంలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట రమణయ్య, తహసీల్దారు శేషఫణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.